ప్రజాశక్తి

ఆదివారం 24 ఆగస్టు 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పొగాకు రైతులను ఆదుకోవాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

ప్రజాశక్తి-కర్లపాలెం

పొగాకు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని స్థానిక ఎఫ్‌సిఐ గొడౌన్‌లోని పొగాకు వేలం కేంద్రం వద్ద రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు శనివారం నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ పొగాకు పంట చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని ఇచ్చిన ప్రభుత్వ హామీని అధికారులు తుంగలో తొక్కి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. పొగాకును రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన అధికారుల్లా లేరని, ప్రైవేట్ కంపెనీ వారికి తక్కువ ధరకు పొగాకును కట్టబెట్టేందుకు ఏర్పాటుచేసిన వారిలాగా అధికారుల తీరు ఉందని విమర్శించారు. పొగాకు బేళ్లలో నాణ్యతా లోపం పేరుతో ఎక్కువ మంది రైతుల వద్ద నుండి రూ.6 వేలకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. కొంతమంది రైతుల వద్ద పొగాకు బేళ్లను తిరస్కరిస్తున్నారని చెప్పారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే ▶ 2లో

వరద నష్టంతో..అప్పులు తీర్చలేక.. 7లో ▲

తెరపైకి 'వెలిగొండ' మొదటి దశ



- భారీగా నిధులు అవసరమైనందుకు 'మొత్తం పూర్తి' అనే అంశం వెనక్కి..
- నిర్వాసితులకే రూ.వెయ్యి కోట్ల వరకూ అవసరం
- ఈ ఏడాది మంజూరు చేసిన నిధులు రూ.80 కోట్లే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికల్లోనూ.. తర్వాత అధికారం చేపట్టాక విజయోత్సవ సభల్లోనూ కూడా పాలక పక్ష నేతలు ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తామని ప్రకటించారు. ఆరునూరైనా పూర్తిచేస్తామని ఎన్నికల్లోనూ ఇదే మాట చెప్పారు. ఈ నెల మొదటి వారంలో దర్శి వచ్చిన సిఎం చంద్రబాబు దీనిపై మరో మాట చెప్పారు. వచ్చే సీజన్ నాటికి అంటే 2026 జూన్ నాటికి వెలిగొండ మొదటిదశకే నీరిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టును పూర్తిచేస్తామని ప్రకటించారు. మొదటి దశ అంటే ఇప్పటికే దాని పనులు పూర్తయ్యాయి. కొత్తగా చేపట్టాల్సిన పనులేమీ లేవు. మొదటి దశ తెరపైకి ఎందుకు వచ్చిందనేదే రైతుల్లో చర్చగా మారింది. ప్రాజెక్టును సంపూర్ణంగా పూర్తిచేయాలంటే ఇంకా రూ.4 వేల కోట్ల నిధులు కావాలి. మొత్తం ఇప్పట్లో పూర్తి చేసే ఆశలు కనిపించడం లేదు. కేవలం నిధుల్లేకనే దీనిపై ఏడాదిగా తర్జనభర్జన సాగుతోంది. పనులు ముందుకు సాగలేదు. మంత్రులూ మాటలతోనే కాలయాపన చేస్తున్నారు. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా ఇంకా హామీలే వినిపిస్తున్నాయి. కార్యాచరణ కనిపించడం లేదు. నిధులు భారీగా అవసరమైనందున దీన్ని ఏదోరకంగా నాన్చుతూనే వస్తున్నారు. ఇక సిఎం చంద్రబాబు మొదటి దశ అనే మాటలతో దీని లక్ష్యాన్ని పూర్తిగా కుదించారు. అంటే మొదటి దశలో చేపట్టాల్సిన పనులేమీ లేకపోగా లక్ష్యాలు కూడా తక్కువగానే ఉన్నాయి. మొదటి దశలో కేవలం నాలుగోవంతు ఆయకట్టుకే నీరు ▶ 2లో



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరి స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధికి కృషి

మంత్రి స్వామి 5లో ▲



సిపిఐ రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా ఒంగోలులో భారీ ర్యాలీ

భూముల జోలికొస్తే సహించం..

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ 5లో ▲



ర్యాలీలో లెనిన్ వేషధారణలో..

తెరపైకి 'వెలిగొండ' మొదటి దశ

(మొదటిపేజీ తరువాయి)

వస్తుంది. అంటే ప్రాజెక్టు కింద 4.25 లక్షల ఆయకట్టుకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు ఇవ్వాల్సి ఉండగా మొదటి దశ పేరుతో 1.19 లక్షల ఎకరాలకు సాగు నీరు, 9.50 లక్షల మందికి తాగునీరు ఇచ్చే కార్యక్రమానికి ప్రాధాన్యతగా పెట్టుకు న్నారు. అయితే ఇప్పటికే రెండు సొరంగాల పనులు పూర్తయ్యాయి. లైనింగ్ పనులు ఆఖరు దశలో ఉన్నాయి. కాలువలకు లైనింగు పనులు చేపట్టాలి. గతంలో చేపట్టిన కాలువలు అక్కడక్కడా దెబ్బతిన్నాయి. వర్షాలకు కొట్టుకుపోయాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలి. అన్నింటి కన్నా నిర్వాసితులదే పెద్ద సమస్య. వారికి ప్యాకేజీలు ఇవ్వాలి. అందుకు రూ.వెయ్యి కోట్ల వరకూ నిధులు కావాల్సి ఉంది. ఈ నిధులు కేటాయించాలి. రిజర్వాయర్‌కు నీరు నింపాలంటే ముందు అక్కడ నుంచీ గ్రామాలు ఖాళీ చేయాలి. ఇది జరగకుండా నీళ్లివ్వడం జరిగే పని కాదు. మరో పది నెలల్లో అన్నీ పూర్తి కావాలి. అప్పుడే వచ్చే సీజన్‌కు నీళ్లివ్వడం సాధ్యమవుతుంది. అయితే నిధుల కేటాయింపులే పెద్దసవాలుగా మారాయి. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరు చేసింది. వీటిని నిర్వాసితు లకు పునరావాసం కోసం కేటాయించారు. బడ్జెట్‌లో రూ.395 కోట్లు వరకూ కేటాయించారు. అవి కూడా విడుదల చేయలేదు. పెండింగ్ బిల్లులకు చెల్లింపులున్నాయి. ఏదేమైనా వెలిగొండపై ఎట్టకేలకు వచ్చేసీజన్‌కు నీరిచ్చే గడువు పెట్టారు. మొదటి దశలో కొంత ఆయకట్టుకైనా నీరు అందనుంది. రిజర్వాయర్‌లోకి నీళ్లు వస్తే పశ్చిమాన భూగర్జజలాలూ పెరగనున్నాయి. ఇప్పుడు శ్రీశైలం రిజర్వాయర్ నిండిపోయింది. నీరంతా దిగువకు పోతోంది. ఇప్పటికే పూర్తి చేసినట్లయితే వెలిగొండకు నీళ్లు వచ్చి చేరేవి. ఇప్పుడు ఆ అవకాశం పోయింది. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు హామీ అమలుకు చర్యలు తీసుకుంటారా? లేక గతంలో హామీల్లాగా అవుతుందా? అనేదీ చూడాలి.

పొగాకు రైతులను ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం టుబాకో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవణ్ణ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో మాట్లాడారు. పొగాకు రైతులను ఇబ్బంది పెట్టే అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టుబాకో ప్రొక్యూర్మెంట్ డిఎం కరుణశ్రీ, తహశీల్దార్ షాకీర్‌పాషా, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

ప్రజాశక్తి-పుల్లలచెరువు: పుల్లల చెరువు జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మెడికల్ ఆఫీసర్ డిఎన్ శ్రీనాథ్ పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణపై వివరించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


అర్హులందరికీ పింఛను అందజేస్తాం

మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-కొండపి

టీడీపీ హయాంల జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం కొండపిలోని కామేపల్లి రోడ్డులో సీతారామకళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ, జోనల్ ఇన్‌చార్జి రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు



మాట్లాడుతున్న మంత్రి స్వామి, దామచర్ల సత్య


చేస్తున్నామని, ఫించన్లు పెంచామని, ఇంట్లో ఎంతమంది విద్యార్థులున్నా తల్లికి వందనం ఇచ్చామని, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మెగా డిఎస్సి ఇలా అన్ని హామీలు అమలు చేస్తున్నామని అన్నారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కొండపి నియోజకవర్గం టీడీపీ కంచుకోట అన్నారు. దీనికి కృషి చేసిన కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా దామచర్ల కుటుంబం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ, జోనల్ ఇన్‌చార్జి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 0.6 టీయంసీల సాగర్ నీటిని ముసికి తీసుకొస్తామన్నారు. అన్ని ప్రాంతాల రైతులను సమన్వయం చేసుకొని ఆ నీటిని వినియోగించుకొనే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సంగమేశ్వరం రిజర్వాయర్‌ను పూర్తి చేసి వెలుగొండ ప్రాజెక్టు నుంచి 2 టీయంసీలు నీటిని తీసుకొని వస్తామన్నారు. మనస్పర్థలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జి.రామయ్యచౌదరి, ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరపతమ్మ, రాష్ట్ర నాయకురాలు రావిపాటి సీతమ్మ, ఆరు మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుల ఎంపిక

కొండపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆరు మండలాల అద్యక్షులను ఎన్నుకున్నారు. కొండపి మండల పార్టీ అధ్యక్షులుగా కొ(ర)పాటి వీరబోగు వసంతరాయుడు, పొన్నలూరు అద్యక్షులుగా అనుమోలు సాంబశివరావు, సింగరాయకొండ మండల పార్టీ అద్యక్షులుగా మించల బ్రహ్మయ్య, మర్రిపూడి అధ్యక్షులుగా గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, టంగుటూరు మండల అధ్యక్షులుగా మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, జరుగుమల్లి మండల అధ్యక్షులుగా పోకూరి రవీంద్రబాబులను ఎన్నుకున్నారు. ఎన్నికైన పార్టీ అధ్యక్షులు నాయకులతో సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు తెలిపారు. నూతన అధ్యక్షులు మంత్రి స్వామి, దామచర్ల సత్య, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అటకాల స్వాములు, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వసంతరాయుడు



సాంబశివరావు



మించల బ్రహ్మయ్య



శ్రీనివాసులరెడ్డి



చంద్రశేఖర్



రవీంద్రబాబు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మనస్తాపంత వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఉప్పుగుండూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామనికి చెందిన మల్లాల శ్రీను (53) ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మహిళతో కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. గత కొద్దిరోజుల నుంచి ఆ మహిళ తనను దూరం పెట్టడంతో మనస్తాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజియా సుల్తానా తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సిఎస్.పురం

వాకింగ్ చేస్తుండగా కారు ఢీకొన్న ఘటనలో సీఎస్‌పురం వాసి మృతి చెందిన సంఘటన నంద్యాలలో జరిగింది. సిఎస్.పురంగ్రామంలోని వడియరాజులనగర్‌కు చెందిన బండారు దేవదాసు (45) నంద్యాలలో బిల్డింగ్ నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లాడు. శనివారం ఉదయం వాకింగ్ చేస్తుండగా కారు ఢీకొట్టడంతో మృతి చెందారు. పొట్టకూటి కోసం వెళ్లి మృత్యువాత పడటంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. దేవదాసుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

4 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -శింగరాయకొండ, ఒంగోలు సబర్బన్

జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచనతో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రైళ్లలో తనిఖీలు చేపట్టారు. పూరీ నుంచి తిరుపతి వెళుతున్న పూరీ ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు నుంచి తనిఖీలు చేసు కుంటూ శింగరాయకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అనుమానించి వారి వద్ద ఉన్న లగేజీలను తనిఖీలు చేయగా 4 కేజీల గంజాయి దొరికింది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని ఒంగోలుకు వెళ్లారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-శింగరాయకొండ

విద్యుత్ సమస్యల ఇచ్చిన పరిష్కారమే లక్ష్యంగా అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్తు వినియోదారుల అదాలత్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. శనివారం శింగరాయకొండలోని కాకతీయ కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. ఈ అదాలత్‌లో 17 అర్జీలు వచ్చాయన్నారు. విజయవాడలోని గుణదల దగ్గర ప్రతిరోజు ఈ కార్యక్రమం జరుగుతుందని సమస్యలు ఉంటే తమకు అర్జీ రూపంలో ఇవ్వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్సి హెచ్ శ్రీనివాసరావు, జిల్లా పరివేక్షణ అధికారి కె.వెంకటేశ్వర్లు, స్వతంత్ర సభ్యులు ఏ.సునీత, డిఇ నాగేశ్వరరావు, ఏడిఇ యుగంధర్, ఏఇ సాంబశివరావు పాల్గొన్నారు.

కోరంలేక సమావేశం వాయిదా

ప్రజాశక్తి-కొండపి

కొండపి సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. కొత్త ప్రభుత్వం అధికారంలకి వచ్చినప్పటి నుంచి వాయిదా పడడం లేదా తూతూమంత్రంగా నిర్వహించడం జరుగుతుంది. శనివారం కూడా మండల సర్వసభ్య సమావేశం కూడా అదే తీరున జరిగింది. సమావేశం ఉదయం 11 గంటలకు మొదలు కావల్సి ఉండగా మధ్యాహ్నం 12:30 గంటల వరకు సభ్యుల కోసం అదికారులు ఎదరుచూశారు. ఎంపీపీ కొండసింగు స్వర్ణకుమారి తప్ప మిగతా సభ్యులు హాజరు కాలేదు. ఒంటి గంటకు కూడా ఎవరూ రాకపవడంత సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవ తెలిపారు. తదుపరి సమావేశాల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని తెలిపారు.

రైతులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి-పీసీపల్లి

కనిగిరిలో జరిగిన అన్నదాత సుఖీభవ రైతు యాత్రలో పాల్గొన్న పిసీపల్లి మండల ట్రాక్టర్ యజమానులకు గొడుగులు, ప్లాస్కులు శనివారం పంపిణీ చేశారు. పీసిపల్లి రైతు సేవా కార్యాలయంలో టిడిపి నాయకులు యారవ శ్రీనివాసరావు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేసినట్లు పిసిపల్లి ఏఓ ఎన్.రంగకృష్ణ తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర సింహారెడ్డి చేపట్టిన యాత్రలో పిసీపల్లి మండలం నుంచి 36 మంది ట్రాక్టర్లతో పాల్గొన్నారు. వీరందరికీ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు అందజేశారు. టిడిపి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి వుందని శ్రీనివాసరావు అన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత భవిష్యత్తు

ప్రజాశక్తి-దర్శి

క్రమశిక్షణతో చదవితే ఉన్నత భవిష్యత్తును అందుకోవచ్చని లక్కవరం గ్రామవాసి, అమెరికాలో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తూము రమణారెడ్డి అన్నారు. శనివారం కిజీజీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీవితంలో ఎదిగిన విధానాన్ని వివరించి విద్యార్థులకు స్ఫూర్తి నింపారు. పాఠశాల విద్య వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైనదన్నారు. విద్యార్థులు ఫేసు బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లతో కాలాన్ని వృథా చేయకుండా తమ లక్ష్యాల వైపు ప్రయాణించాలన్నారు. కిజిజి పాఠశాల క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తూము రాజగోపాలరెడ్డి, డైరెక్టర్ కేతు రమణారెడ్డి, ఆంథోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తూము రమణారెడ్డి

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి

దర్శి 2వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శనివారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కురిచేడు రోడ్డులో పీ.టి.ఎస్. కన్వెన్షన్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ, 12వ, ఐటిఐ, బి.టెక్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు, పురుషులు మరియు మహిళలు, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గలవారు ఫ్రెషర్స్ అయినా లేదా అనుభవజ్ఞులైనా ఈ జాబ్ మేళాలో పాల్గొని తగిన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి అభ్యర్థి తప్పక వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జె.రవితేజ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.శ్రీనివాసచారి, హెచ్‌ఆర్ మరియు మైన్ మరియు దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ మండల టిడిపి అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, దొనకొండ టౌన్ టిడిపి అధ్యక్షులు షేక్ తోహీద్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

పంటల పరిశీలన

ప్రజాశక్తి-దర్శి : ఒంగోలు జిల్లావనరుల కేంద్రం శాత్రవేత్త బృందంతో కలిసి శనివారం దర్శి మండలంలోని చింతల పాలెం, తూర్పువీరయపాలెం గ్రామాల్లో వరి, జొన్న, మొక్క జొన్న పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జి.రమేష్ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు పిచికారీ చేయాల్సిన మందుల గురించి వివరించారు. వరిలో నారు మడిలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఎం.రజనీకుమారి, ఎడిఎ రామ్మోహన్, దర్శి ఎడిఎ కె.బాలాజీ నాయక్, దర్శి వ్యవసాయధికారి రాధ, ఒంగోలు వ్యవసాయ అధికారి శేషమ్మ, శైలజ, విఎఎలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-దర్శి : తాళ్లూరు మండలంలోని పలు గ్రామాలలో బెల్ట్ షాపులపై దాడులు చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాళ్లూరు మండలం కొత్తపాలెం గ్రామం సమీపంలోని కాలువ చట్ట వద్ద శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి 13 మద్యం సీసాలు బెల్ట్ షాపు నిర్వాహణకు అక్రమంగా కలిగి ఉండటంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో స్టేషన్ ఎస్ఐ విఆర్.సత్యనారాయణరావు, యూసుఫ్ షరీఫ్, సిబ్బంది నాగరాజు, ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం

ప్రజాశక్తి-టంగుటూరు

జార్కండ్ నుంచి ట్రాలీ లారీ చెన్నయిలో డీలర్‌కు స్వాదీనం చేయడానికి వెళ్తోంది. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట 16వ నెంబరు జాతీయ రహదారి వద్ద భోజనానికి డ్రైవరు ట్రాలీని రోడ్డు పక్కకు తీసి నిలిపారు. ట్రాలీ ఇంజను నుంచి పొగలు రావడం గమనించిన డ్రైవర్ టంగుటూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. షార్ట్ సర్క్యూట్‌తో ట్రాలీ లారీ క్యాబిన్ పూర్తిగా దగ్ధం అయింది. ట్రీలీ ముందు టైర్లు, ఇంజను పాక్షికంగా కాలిపోయింది. టంగుటూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

గడ్డి మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి-అర్ధవీడు

గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన వేల్పుల మల్లేశ్వరుడు(22) గడ్డి మందు తాగి గత నెల 31న ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని తూర్పు బొమ్మలాపురం ఎస్సీపాలెంలో వేశపోగు యోహాన్ (41) అనే వ్యక్తి శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ మహేష్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న దృశ్యం

సీఎం సహాయనిధి పేదలకు వరం

ప్రజాశక్తి - రేపల్లె

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇది అందుతుందని రెవెన్యూ మంత్రి సత్య ప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ తెలిపారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ఈ నిధి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 15 మంది లబ్ధిదారులకు రూ.40.51 లక్షల విలువైన చెక్కులు శనివారం పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో రూ.3కోట్లకు పైగా సీఎం సహాయ నిధి నిరుపేదలకు అందజేసినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న జడ్జి డి నాగ వెంకటలక్ష్మి

13న లోక్అదాలత్

ప్రజాశక్తి - అద్దంకి

జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 13న కోర్టు ఆవరణలో జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి డి నాగ వెంకటలక్ష్మి తెలిపారు. కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ గురించి పోలీసు, బ్యాంక్, రెవిన్యూ, మునిసిపల్ అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. కోర్టులో పెండింగ్ ఉన్న అన్ని సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇరు వర్గాల వారితో సామరస్యంగా మాట్లాడి వాళ్ళ ఇష్ట ప్రకారమే రాజీ చేయాలని సూచించారు. బ్యాంకు, రెవిన్యూ కేసులు, మున్సిపల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించు కోవచ్చు అన్నారు. కార్యక్రమంలో జడ్జిలు సీత, బి అభిత్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై శ్రీనివాసరావు, ఎపిపి వడ్లవల్లి వీరనారాయణ, ఎజిపి వై రమేష్ బాబు, సిఐలు ఎ సుబ్బరాజు, కె వెంకట్రావు, ఎం శేషగిరి, ఎస్ఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చప్పిడి వీరయ్య

ప్రతిభామూర్తులకు ఘన సత్కారం

ప్రజాశక్తి - అద్దంకి

ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా రోడ్డులోని చిన్ని శాంతయ్య సేవాసదన్‌లో పౌరాణిక రంగ స్థల నటులు వల్లూరి వెంకటరామయ్య చౌదరి స్మారక కళావేదికపై ప్రతిభా మూర్తుల సభ శనివారం నిర్వహించారు. సభకు నిమ్మరాజు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో రోటరీ మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. షేక్ మస్తాన్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన సభలో సినీనటులు కోట శ్రీనివాసరావు సినీ జీవిత విశేషాలు వివరించారు. రంగ స్థల నటులు కుందుర్తి సీతారామయ్య శాస్త్రి మాయల్ ఫకీర్ ఏకపాత్రాభినయం చేశారు. ప్రతిభామూర్తుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగి, శ్రీరామ వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు రావూరి రంగయ్య, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డిపో కమిటీ ప్రతినిధులు సేవా రత్న పురస్కారంతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఆర్‌వి రాఘవరావు, జ్యోతి చంద్రమౌళి, అన్నమనేని వెంకట్రావు, వెలిసిరి రమణ, దివాకర దత్తు, యు దేవపాలన, మిట్ట కామేశ్వరశర్మ, ఎం త్రిమూర్తులు, చిన్న కోటయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెప్టెంబరు 27, 28 తేదీల్లో రేపల్లెలో

సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - బాపట్ల


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్

సిఐటియు జిల్లా ద్వితీయ మహాసభలు సెప్టెంబర్ 27, 28 తేదీల్లో రేపల్లెలో జరుగుతాయని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి హెచ్ మణిలాల్, సి హెచ్ మజుందార్ తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పడిన నాలుగేళ్ళలో చేసిన పోరాటాలు సమీక్షించుకొని రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యాచరణపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. తొలి రోజు 27న రేపల్లెలో పెద్ద ఎత్తున కార్మిక ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. సభలకు సిఐటియు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మండల మహాసభలు, వివిధ కార్మిక సంఘాల మహాసభలు జరుగుతాయని తెలిపారు. గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో కార్మికవర్గ సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయని తెలిపారు. అంగన్‌వాడి, ఆశ, విఒఎ, మున్సిపల్, సర్వ శిక్ష అభియాన్, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ రంగాల్లో జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయని గుర్తు చేశారు. ఆ ఆందోళనల ఫలితంగా అనేక కార్మిక హక్కులు సాధించుకున్నట్లు తెలిపారు. ఈ మహాసభల ద్వారా భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించనున్నట్లు తెలిపారు. మహాసభలు జయప్రదం చేయాలని కోరారు.

సైన్స్ స్పెయిర్ నామినేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - బాపట్ల


మాట్లాడుతున్న డిఇఒ పురుషోత్తం

విద్యార్థుల ఆలోచనలకు మరింత పదును పెట్టి సమాజానికి స్ఫూర్తి నింపే నూతన ఆవిష్కరణలకు తెర తీసే విధంగా నోడల్ సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఒ ఎస్ పురుషోత్తం అన్నారు. స్థానిక డిఇఒ కార్యాలయంలో నోడల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్ స్పెయిర్ నామినేషన్ 2025 రిజర్వేషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించారు. జిల్లాలో ప్రతి యుపి పాఠశాల నుండి మూడు ప్రాజెక్టులు, ఉన్నత పాఠశాల నుండి ఐదు ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ చేయించాలని అన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుండి విద్యార్థులను ఉత్సాహపరిచి ఇన్ స్పెయిర్ ప్రాజెక్టుల నమోదు చేయాలన్నారు. తయారు చేసే ప్రాజెక్టులు స్ఫూర్తిదాయకంగా పేటెంట్ హక్కులు పొందే స్థాయి వరకు వెళ్లే విధంగా తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యార్థుల్లో ఎందరో అబ్దుల్ కలాంలు, సివి రామన్లు ఉన్నారని అన్నారు. అలాంటి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యమని అన్నారు. హెచ్ఎంలు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సెప్టెంబర్ 15 లోపు జిల్లా నుండి గరిష్ఠంగా నామినేషన్లు నమోదుకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి హాజరైన 25 మండలాల నోడల్ సైన్స్ ఉపాధ్యాయులు వెంటనే అన్ని పాఠశాలలు రిజిస్టర్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, నోడల్ టీచర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించి పర్యావరణం రక్షిద్దాం

ప్రజాశక్తి - బాపట్ల



పాత బస్టాండు వద్ద విద్యార్థుల మానవహారం

ప్లాస్టిక్ వ్యర్థాలతో విషవాయువులు వెలువడి రోజు రోజుకీ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు ప్రతిన బూనాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనారాణి అన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగంతో ప్రకృతిని కలుషితం చేసే విధంగా పర్యావరణంపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన ర్యాలీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలి, నీరు, మట్టి ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం అవుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి లోపల నిలిచిపోవడంతో భూ తాపం పెరిగిపోయి పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. పర్యావరణానికి పెను సవాలుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నూలు వస్త్రాలు, జనపనార సంచులు వాడాలని సూచించారు. 'ప్లాస్టిక్ నిర్మూలిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే ప్లకార్డులు చేతబూని వ్యవసాయ కళాశాల నుంచి గడియార స్తంభం సెంటర్, పాత బస్టాండ్ వరకు ర్యాలి నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం అంటూ నినాదాలు చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎం రమాదేవి, సి సంధ్యారాణి, బి రవీంద్రారెడ్డి, అబ్దుల్ సలీం, జి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టు మురళికి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - చీరాల


జర్నలిస్టు మురళికి నివాళులర్పిస్తున్న కరణం వెంకటేష్

సీనియర్ జర్నలిస్టు కడియం మురళి (52) శుక్రవారం మృతి చెందగా ఆయన అంత్యక్రియలు శనివారం హరి ప్రసాద్ నగర్‌లోని ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఆయన ఆకస్మిక మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి చెందినట్లు తెలిసిన వెంటనే పలువురు జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు ఆయనకు నివాళు లర్పించారు. చదువుల నిమిత్తం విదేశాల్లో ఉన్న ఇద్దరు కుమారులు వచ్చిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్, మునిసిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, పలువురు విలేకర్లు, కుటుంబ సభ్యులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

గ్రామాల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


ఏలూరి సాంబశివరావు

గ్రామాలను ప్రగతి బాటలో నిలపడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు శాసన సభ్యులు ఏలూరి సాంబశివ రావు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకం కింద 19 పనులకు రూ.80 లక్షలు మంజూరు చేస్తూ కలెక్టర్ వెంకటమురళి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతులు కల్పించే పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇంకొల్లు మండలం భీమవరంలో 4 పనులకు రూ.20లక్షలు, యద్దనపూడి మండలం యనమదలలో 6 పనులకు రూ.20 లక్షలు, చిన్నగంజాం మండలం సంతరావూరులో 4 పనులకు రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సురక్షిత మంచినీరు, అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణం, పర్చూరు మండలం దేవరపల్లిలో 05 పనులకు రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పారు.


పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

నివాస ప్రాంతాల చుట్టూ మురుగు నీటి నిలువలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా పంచాయతీ, సచివాలయం సిబ్బంది, అధికారులు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ పారిశుద్ధ కార్మికులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు చేత స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. మురుగు నీరు నిలువ కుంటల్లో, మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు తడి చెత్త, పొడి చెత్త వేరుగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, కార్యదర్శి మస్తానరావు, ఎపిఒ రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ రాంబాబు

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు..

ప్రజాశక్తి - బాపట్ల

మత్తుపదార్థాలకు విద్యార్థులు, యువకులు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సిఐ రాంబాబు అన్నారు. ఎస్పీ సూచనల మేరకు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై ఈగల్ టీం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. చాలామంది యువకులు సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి భవిష్యత్తు నాశనం చేస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించడం వల్ల విద్యార్థుల జీవితాలు, కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వలన ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులు, గౌరవ మర్యాదలు కోల్పోవాల్సి వస్తుందని వివరించారు. మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి సమాచారం ఏదైనా తెలిస్తే పోలీసులకు తెలపాలని కోరారు. డ్రగ్స్ నివారణ కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1972లో సంప్రదించాలని తెలిపారు. వ్యవసాయ కళాశాల డీన్ పి ప్రసూనరాణి, రమాదేవి, సంధ్యారాణి, అబ్దుల్ సలాం, ఈగల్ టీం దుర్గ ప్రసాద్, సతీష్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర'లో భాగస్వామ్యం కావాలి..: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ జె.వెంకట మురళి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ జె. వెంకట మురళి, స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో 57 ఎకరాల మేర భూమి ఉందని ఈ ప్రాంతమంతా శుభ్రం చేయడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి, ఎక్సైజ్ శాఖ ఇ.ఎస్ వెంకటేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్రావు, జిల్లా ప్రణాళిక అధికారి షాలోమ్ రాజు, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు సర్వేయర్ల బదిలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఇద్దరు మండల సర్వేయర్లు బదిలీ అయ్యారు. ఒంగోలు రూరల్ మండల డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తున్న విష్ణువర్ధన్‌ను జరుగుమల్లి మండలానికి బదిలీ చేశారు. జరుగుమల్లి మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న బాబూరావును ఒంగోలు రూరల్ మండల సర్వేయర్‌గా బదిలీ చేశారు. శనివారం నాడు వీరిద్దరూ విధుల్లో చేరారు.

డిఎస్‌సి ఫలితాలలో 'శ్రీవికాస్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిఎస్‌సి-2025 పరీక్షా ఫలితాలలో ఒంగోలు అంజయ్య రోడ్డులోని శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థిని జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన తిమ్మసముద్రం గ్రామానికి చెందిన జె.అంజని (93.013) మార్కులతో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ అందుకుంది. ఎల్.మౌనిక ఎస్‌జిటి విభాగంలో (89.8) మార్కులతో జిల్లా స్థాయిలో 11వ ర్యాంకును సాధించారు. ఓ.సాత్విక, జి.అరుణ ప్రసాద్, పి.పావని, డి.ప్రభావతి, ఏ.దేవసహాయం, మేరీరాణి, జి.నరసింహారావు ఉత్తమ ర్యాంకులను దక్కించుకున్నట్లు కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహన రావు, డైరెక్టర్ పి.వీరయ్య తెలియజేశారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను అభినందించారు.

వైసిపి ఆధ్వర్యంలో ప్రకాశం పంతులుకు నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వై ఎం ప్రసాద్ రెడ్డి(బన్నీ)తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భూముల జోలికొస్తే సహించం..

- అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు సాగు భూములు కట్టబెడుతున్నారు..
- నరహంతకుల కాళ్లు మొక్కుతున్న టీడీపీ, వైసిపి..
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- పార్టీ రాష్ట్ర మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

'అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు సాగు భూములు కట్టబెట్టడం, రాజధాని, పరిశ్రమల పేరుతో రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం తీవ్రంగా తప్పు పట్టారు. భూముల జోలికి వస్తే సహించేది లేదు... కాళ్లు విరగ్గొడతాం. దున్నేవాడికి భూమి కావాలి, కంపెనీలకు భూములు ఎందుకు? అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రశ్నించారు. ఒంగోలులో సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో నారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఘాటు విమర్శలు చేశారు. రాజ్యాంగంపై ప్రధాని మోడీకి నమ్మకం లేదని, స్వాతంత్ర ఉద్యమంలో పాలుపంచుకోని ఆర్‌ఎస్‌ఎస్‌ను భుజాలపై మోస్తున్న మోడీని ఫాసిస్ట్‌గా అభివర్ణించారు. ఇండియా వేదికను బలపరిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని కూడా నక్సలైట్‌గా వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యవాదులమని చెప్పుకునే చంద్రబాబు నాయుడు, జగన్ ఢిల్లీలో నరహంతకుల కాళ్ళ మొక్కుతున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ రోజుకో మాట మార్చుకుంటూ.. ఊసరవెల్లిలా సనాతన ధర్మం పేరిట బిజెపి ఎజెండాను ముందుకు తీసుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు. కార్పొరేట్ కంపెనీలకు పన్ను రాయితీలు ఇస్తూ, సామాన్య ప్రజలపై జీఎస్టీ భారాన్ని మోపడం మోడీ ప్రభుత్వానికి నిదర్శనమని నారాయణ మండిపడ్డారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్‌తో పాటు పాల్గొన్న ఏకైక పార్టీ సిపిఐ అని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ అయితే స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేకుండా బ్రిటిష్ తొత్తులుగా వ్యవహరించిందని విమర్శించారు.

మహాసభలో కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జి.వి.ఎస్.ఎన్. సత్యనారాయణమూర్తి, జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, హరినాథ రెడ్డి, జి.ఓబులేసు, పి.రామచంద్రయ్య, జి.జగదీష్, కేవీపీ ప్రసాద్, జంగా అజయ్ కుమార్, డేగ ప్రభాకర్ రెడ్డి, పి.జె. చంద్రశేఖర రావు పాల్గొన్నారు. అలాగే ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఎమ్.ఎల్. నారాయణ, సినీ నటుడు మాదాల రవి, దుర్గ భవాని, విమల మరియు జిల్లా కార్యదర్శులు కూడా హాజరయ్యారు. తొలుత మహాసభ పూర్వ జాతీయ కార్యదర్శి డాక్టర్ సరవరం సుధాకరరెడ్డి అకాల మతికి సంతాపం ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మహాసభ సందర్భంగా నెల్లూరు బస్టాండ్ నుంచి ప్రకాశం భవన్, విచ్ సెంటర్, పాత మార్కెట్, అద్దంకి బస్టాండ్, సాగర్ హెూటల్ మీదుగా కొత్త మార్కెట్ వేదిక వరకు సిపిఐ భారీ ప్రదర్శన నిర్వహించింది.

చెప్పు చూపిస్తూ..



చెప్పు చూపిస్తున్న నారాయణ

ప్రజలందరూ పాదాలకు రక్షణగా వాడుకునే చెప్పులపై 5 శాతం జిఎస్‌టిని 12 శాతం, 18 శాతంగా పెంచి కార్పొరేట్ పన్నులు 35 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన మోడీని ఏం చేయాలో ప్రజలే నిర్ణయించుకోవాలని.. చెప్పు చూపిస్తూ సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ సభలో సంచలన వ్యాఖ్యలు చేశారు.



సిపిఐ నేతలకు కరచాలనం చేస్తూ..స్వాగతం పలుకుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు, నాయకులు

ర్యాలీకి సిపిఎం ఘన స్వాగతం..

సిపిఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం కావాలని కాంక్షిస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సిపిఐ మహాసభల ర్యాలీకి ఘన స్వాగతం పలికారు. శనివారం నాడు నెల్లూరు బస్టాండ్ నుంచి సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ నేతృత్వంలో ప్రదర్శనగా వచ్చిన ర్యాలీకి స్థానిక సాగర్ హెూటల్ వద్ద సిపిఎం జిల్లా నాయకులు పూలతో స్వాగతం పలికారు. 'వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలి..' అంటూ నినదించారు. స్వాగతం పలికిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, ఎం.రమేష్, నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు, పమిడి వెంకటరావు, కాలం సుబ్బారావు, జి.రమేష్, పి.వెంకటరావు, రఘురామ్, వి.బాలకోటయ్య, కంకణాల రమాదేవి, పి కల్పన, నాయకులు, దామా శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, బి ముసలారెడ్డి, జి ఆదిలక్ష్మి, కె వెంకటేశ్వర్లు, భక్తసింగ్ రాజు, మారెళ్ల సుబ్బారావు ఉన్నారు.

టంగుటూరి స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధికి కృషి

మంత్రి స్వామి



'టంగుటూరి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అందరూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకుని శనివారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయకుమార్, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎపి మాల వెల్ఫేర్ కార్పోరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయకుమార్, జేసీ ఆర్.గోపాలకృష్ణతో కలిసి మంత్రి స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు మునిమనుమడు సంతోష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఏబిఎం కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ పింగళి పాండు రంగారావు రచించిన 'జాతీయ స్థాయి ధీరుడు టంగుటూరి ప్రకాశం' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, డ్వామా పీడీ జి. జోసఫ్‌కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, డిటిసి ఆర్.సుశీల, డిసిఓ పద్మశ్రీ, డిఆర్‌డిఏ పీడీ నారాయణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

దేవరంపాడులోని స్థూపం వద్ద..

ఆంధ్రకేసరి జయంతిని పురస్కరించుకుని శనివారం ఒంగోలు మండలం దేవరంపాడులోని స్థూపం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ప్రకాశం పంతులు, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ ఈ స్మారకం వద్ద రెండు ఎకరాల విస్తీర్ణంలో డ్వామా ఆధ్వర్యంలో పల్లెవనం ఏర్పాటు చేయిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌కుమార్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

మార్గదర్శకంగా 'టంగుటూరి'

బాపట్ల జిల్లా: నేటి సమాజానికి టంగుటూరి ప్రకాశం పంతులు మార్గదర్శకంగా నిలిచారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలు స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో శనివారం జరిగాయి. ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్ : ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 25, 26 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 25న వుడా చైర్మన్ షేక్ రియాజ్ ప్రమాణ స్వీకార మహెూత్సవంలో పాల్గొంటారు. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు. 26న స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు.

యూరియా కొరత లేదు: ఏడీఏ



మాట్లాడుతున్న బాపట్ల ఎడిఎ ధనరాజు

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలో యూరియా, డిఎపి కొరత ఉందనే పుకార్లు నమ్మవద్దని ఎడిఎ ధనరాజు తెలిపారు. ఎరువుల పంపిణీపై తీసుకోవలసిన చర్యలపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో 13182 ఎకరాల్లో వరి పంటకు సరిపడా ఎరువులు ఉన్నాయని తెలిపారు. పిన్నిబోయినవారిపాలెం, ఈస్ట్ బాపట్ల, ఈతేరు, మూలపాలెం, కంకటపాలెం ఆర్ఎస్‌కెల ద్వారా 80 టన్నుల యూరియా అందించినట్లు తెలిపారు. జిడిసిఎంఎస్, పిఎసిఎస్ ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీ కమిటీలో ఎఒ శారద, తహశీల్దారు షేక్ సలీమా, ఎఎస్ఐ స్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు తెలిపారు. వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు సాగు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పొగనారు మడి పెంపకం, పొగాకు విత్తనాల కొనుగోలుపై నిషేధం విధించినట్లు తెలిపారు. పొగాకు సాగును అడ్డుకుంటామని తెలిపారు.

అమృతలూరు : ఎరువుల కృత్రిమ కొరత, యూరియా అక్రమ నిల్వలు, సరఫరాపై మండల స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఎఒ హేమంత్ భరత్ కుమార్ తెలిపారు. ఈ కమిటీలో ఎఒ, తహశీల్దారు, ఎఎస్ఐ లేదా హెడ్ కానిస్టేబుల్ మండల స్థాయి టీంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో ఎరువుల దుకాణాలు సందర్శించి ఎరువుల నిల్వలు, సరఫరా, బిల్లులు తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా డీలర్లు ఎరువులు ఉంచుకుని కొరత సృష్టించిన, కొన్ని బస్తాలు కొంతమంది రైతులకు మాత్రమే సరఫరా చేసినా, ఎటువంటి అనధికార కార్యకలాపాలకు పాల్పడిన తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. షాపు లైసెన్స్ రద్దు చేస్తావని అన్నారు. యూరియా సరఫరా, వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. హెడ్ కానిస్టేబుల్ పివి కృష్ణ, అమర్తలూరు పిఎసిఎస్ అధ్యక్షులు కొత్తపల్లి రవీంద్రబాబు, సిఇఒ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పర్చూరు : రైతులకు ఎరువుల కొరత లేదని ఎడిఎ ప్రవీణ శనివారం తెలిపారు. సబ్ డివిజన్లోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యాద్దనపూడి మండలాల్లో వరి, మొక్కజొన్న, పత్తి, మినుము పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ పైర్లు సాగుచేటుకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా సరిపడ ప్రైవేట్ డీలర్ల వద్ద, సొసైటీల్లో అందుబాటులో ఉందన్నారు. భూసార పరీక్షల్లో సిఫార్సు చేసిన ఎరువుల మోతాదు మాత్రమే రైతులు పొలంలో వాడాలని కోరారు. యూరియా 969 మెట్రిక్ టన్నులు, డిఎపి 600 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 650 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయిని తెలిపారు. రైతులెవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెప్పారు. జిల్లాలో తెల్లబర్లి, నల్లబర్లి పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. రైతులు ప్రైవేటు కంపెనీలు పెట్టే ప్రలోభాలకు లోను కాకుండా, ఎట్టి పరిస్థితుల్లో పొగాకు పంట సాగు చేయుకూడదని తెలిపారు. ఒకవేళ సాగు చేస్తే రైతులపై చర్యలు తీసుకుంటారని తెలిపారు.

చెరుకుపల్లి : మండలంలోని రైతు సేవా కేంద్రాలు, మార్కెట్ యార్డు, పిఎసిఎస్‌లో యూరియా, డిఎసి అందుబాటులోకి వస్తున్నాయని ఎఒ ఎండి ఫారుక్ తెలిపారు. మండలంలో మార్కెట్ యార్డు, పిఎసిఎస్ ద్వారా 110 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లుగా తెలిపారు.



మాట్లాడుతున్న అమృతలూరు ఎఒ హేమంత్ భరత్ కుమార్

సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ సిఎస్ఇ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. న్యూమెంటికా ప్రెసిడెంట్ శ్రీకృష్ణనన్, ఎల్ఎల్‌సి, ఎన్ఎస్ఎ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జోజునా విద్యార్థులకు అనేక మెళుకువులు వివరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్ ఫర్ ఎ సీంలెస్ ట్రాన్సిషన్ ఫర్ ఎకడమియా టు ఇండస్ట్రీ అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణనన్ మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా పెంపొందించుకోవాలి, ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయనే వివరాలు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టూల్స్ ఎలా ఉపయోగించాలనే వాటిపై అవగాహన కల్పించినట్లు సిఎస్ఇ హెచ్ఒడి పి హరిణి తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ఇ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి.. యువకుడు మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు



బట్టు భాను (ఫైల్)

బైకుపై వెళుతూ అదుపుతప్పి కిందపడి తలకు తీవ్ర గాయమై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అద్దెపల్లి వద్ద చోటుచేసుకుంది. మండలంలోని ఐలవరంకు చెందిన బట్టు భాను (24) అనే యువకుడు మరొక యువకునితో కలిసి భట్టిప్రోలు నుండి ఐలవరంకు ద్విచక్ర వాహనంపై వస్తు న్నారు. అద్దేపల్లి చాలిచెరువు దాటి 216 జాతీయ రహ దారిపై వస్తుండగా బైకు అదుపుతప్పి రహదారిపై పడ్డాడు. బైకు వెనుక వైపు కూర్చుని ఉండటంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దీంతో క్షతగాత్రున్ని 108 వాహనం ద్వారా వైద్య చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు పెయింటింగ్ పనిచేస్తూ జీవిస్తుంటాడు. మృతునికి వివాహం కూడా కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - సంతమాగులూరు



ప్రమాదానికి కారణమైన లారీ

మండలంలోని ఏల్చూరు సమీపంలోని రామి రెడ్డి పాలెంలో అద్దంకి, నార్కెట్‌పల్లి రహదారిపై కంటైనర్ లారీ మోటార్ సైకిల్‌ లిస్టును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాల య్యాయి. వినుకొండ మండలం గోకనకొండకు చెందిన గద్దల తిరుపతి అతని భార్య గద్దల కోటేశ్వరమ్మ నరసరావుపేట హాస్పిటల్లోని తమ బంధువులను చూసేందుకు మోటార్ సైకిల్‌పై బయలు దేరారు. రామిరెడ్డిపాలెం రాగానే చెన్నై నుండి హైదరాబాద్ వెళుతున్న కంటైనర్ లారీ ముందు వెలుతున్న మోటార్ సైకిల్‌ను ఢీ కొంది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న గద్దల కోటేశ్వరమ్మ (45) కంటైనర్ లారీ వెనుక టైర్ల కింద పడి నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందారు. భర్త గద్దల తిరుపతికి గాయాలయ్యాయి. కోటేశ్వరమ్మకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరు వంట పనులు చేస్తూ జీవిస్తున్నారు. దీంతో గోకనకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పట్టాభిరామయ్య పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీని స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు జరిగిన మోటార్ సైకిల్ ప్రమాదాల్లో 15 మంది వరకు మృత్యువాత పడ్డారు. 20 మందికి పైగా గాయాలైన ఘటనలు చోటుచేసుకున్నట్లు తెలిపారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బంగ్లా రోడ్డులోని ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు దేశభక్తి, ధైర్య సాహసాలు, త్యాగనిరతిని గుర్తు చేసుకున్నారు.

బాపట్ల : స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన భూమిక నిర్వహించిన తెలుగు బిడ్డ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ పి ప్రసూనరాణి అన్నారు. ప్రకాశం పంతులు జయంతి వ్యవసాయ కళాశాల్లో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

పర్చూరు : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి తహశీల్దారు బ్రహ్మయ్య నివాళులర్పించారు. ప్రకాశం పంతులు జీవితం యువతకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి మాధవి లత, సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

వేమూరు : టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహశీల్దారు భీమవరపు సుశీల పాల్గొన్నారు.

యద్దనపూడి : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తహశీల్దారు కె రవి కుమార్ మాట్లాడారు. ఆయన నిజాయితీ, త్యాగం, ధైర్యసాహసాలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. తనకున్న ఆస్తి మొత్తాన్ని స్వాతంత్ర్య ఉద్యమంలో ఖర్చు చేశారని అన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి విష్ణు, మండల సర్వేయర్ వి సుబ్బారావు, విఆర్ఒలు శేషుబాబు, వసంతరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, గంగాధర్, సుభాని పాల్గొన్నారు.

చెరుకుపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలతో ఘనంగా శనివారం నివాళులర్పించారు. ఎంపిడిఒ సుభాని, ఈఒపిఆర్‌డి కెజిఎ శ్రీనివాసన్ పాల్గొన్నారు.



వేమూరులో నివాళులర్పిస్తున్న రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సిఐ సుబ్బరాజు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నియంత్రించడంలో ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని, హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులు పట్ల వివక్షత విడనాడాలని సిఐ సుబ్బరాజు పేర్కొన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఎపి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం దిషావిష ఆధ్వర్యంలో ఆగస్టు 12 నుండి అక్టోబర్ 12 వరకు చేపట్టిన అవగాహన గోడ పత్రికలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐతోపాటు ఒంగోలు 1వ పట్టణ సిఐ వై నాగరాజు, పిఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పిడి బివి సాగర్ మాట్లాడారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మరణాలు తగ్గించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నిరంతరం కృషిచేస్తున్నాయని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా ఉండాలంటే సోషల్ మీడియా, గోడపత్రికలు, కరపత్రికలు, వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కలిగించాలని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా నియంత్రించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పిడి బివి సాగర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుకొనే విధంగా చూడాలని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల కోసం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ టోల్ ఫ్రీ 1097 నెంబర్‌ను ప్రజలకు అవగాహన కలిగించాలని చెప్పారు. హెల్ప్ టిఐ అద్దంకి ఔట్రిచ్ వర్కర్స్ టి దుర్గాభవాని, టి లక్ష్మీ తేజస్విని, ఎం మల్లేశ్వరి, పిఈఎం మల్లేశ్వరి పాల్గొన్నారు.

నేడు రైతులకు రుణాల చెక్కులు అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని సూరేపల్లి పిఎసిఎస్ పరిధిలోని రైతులకు 2025 – 26కుగాను 17 మంది రైతులకు సిసి, వ్యవసాయ రుణాల కింద రూ.1.40 కోట్ల రుణాలు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదుగ ఆదివారం అందజేయనున్నట్లు సొసైటీ ఛైర్మన్ గోవర్ధనగిరి సుధాకర్ తెలిపారు. కార్యక్రమానికి సొసైటీ పరిధిలోని రైతులు హాజరు కావాలని కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - చీరాల



మాట్లాడుతున్న ఛైర్మన్ సాంబశివరావు

పరసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు నివారించడంతోపాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాల సీజన్‌లో విస్తరించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ, ముక్కోణం పార్క్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరింది. డ్రైనేజీలు, చెత్త కుప్పలు, దోమల వృద్ధి కేంద్రాలను తొలగించడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు నివారించవచ్చని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈఈ రఘురాం, ఎఈ రవి కిరణ్, మేనేజర్ శ్రీనివాసన్, సూచ్చేంద్ర పాల్గొన్నారు.

వరద నష్టంతో..అప్పులు తీర్చలేక..

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలం పోతర్లంక గ్రామానికి చెందిన ఈడుపుగంటి మురళీకృష్ణ (40) అనే కౌలు రైతు వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక వడ్డీలు పెరిటమే కాక పంటలు సకాలంగా చేతికి రాకపోవడంతో మనస్థాపానికి గురై ఈనెల 17న పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొల్లూరు మండలం దోనేపూడి గ్రామానికి చెందిన పాలేటి యుగంధరరావుకు చెందిన సర్వేనెంబర్ 15-19 నందు 5.85ఎకరాల మెట్ట భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పసుపు ఒక ఎకరం, కంద రెండున్నర ఎకరాలు, అరటి రెండున్నర ఎకరాలు సాగు చేశాడు. బ్యాంకు, గ్రామంలో ప్రైవేటుగా రుణాలు తీసుకొని పెట్టుబడులు పెట్టాడు. ప్రస్తుత వరదల వల్ల పంట భూమిలోకి నీరు చేరి పంటలు పాడైపోయాయని బాధపడుతూ ఈనెల 17న రాత్రి 8గంటల సమయంలో


రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు

ఆయన నివాసంలో పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే పొన్నూరు సజ్జా చంద్రమౌళి హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడతో మెరుగైన వైద్యం నిమిత్తం శనివారం తెల్లవారు జామున 4గంటలకు గుంటూరు హాస్పిటల్‌కు తీసుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అంబులెన్స్‌లోనే మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె రుషిత 7వ తరగతి చదువుతుండగా కుమారుడు జితేంద్ర సాయి 5వ తరగతి చదువుతున్నారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం రూ.15 లక్షల అప్పులు చేసి ఉన్నారని కుటుంబ సభ్యులు వ్యవసాయ అధికారికి తెలిపారు. ఈ మేరకు త్రీ మెన్ కమిటీ ద్వారా మృతికి గల కారణాలపై నివేదికల సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు ఎఒ తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు తోడేటి సురేష్ మాట్లాడుతూ కౌలు రైతు మృతికి గల కారణాలపై అధికారులు పారదర్శకంగా నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. రాష్ట్రంలో కౌలు రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, కౌలు గుర్తింపు కార్డులపై బ్యాంకులు సకాలంలో రుణాలు ఇవ్వకపోవడం వలన ప్రైవేటు వ్యాపారుల నుండి అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నరని అన్నారు. కౌలు రైతు మృతి సమాచారం తెలుసుకున్న శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మార్గమధ్యంలో తెనాలిలో మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా మృతుని కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసాని ఇచ్చారు.

పాముకాటుకు గురై సర్పంచి మృతి

ప్రజాశక్తి - ముండ్లమూరు


వద్దేపోగు ఆదిలక్ష్మి (33)

పాము కాటు గురై ముండ్లమూరు సర్పంచ్ వద్దేపోగు ఆదిలక్ష్మి (33) శనివారం మృతి చెందారు. పంచాయతీ పరిధిలోని వేంపాడుకు చెందిన వద్దేపోగు ఆదిలక్ష్మి పంచాయతీ ఎన్నికల్లో టిడిపి మద్దతు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్ విధులు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి ఎంతో తోడ్పడిన ఆమె మొక్క జొన్న పంటకు ఎరువు ముందు చల్లడానికి కూలీలను తీసుకువెళ్లి వారితోపాటు ఈమె కూడా ముందు చెల్లుతుంది. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో స్పృహ తప్పి పడిపోయారు. అక్కడున్న వారు హుటాహుటిన అద్దంకి తరలించగా వైద్యుల పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం వేంపాడుకు తీసుకొచ్చారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి టిడిపి దర్శి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత్ సాగర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, భర్త గురవయ్యను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకట్రావు, నాయకులు వీరపనేని రంగ, మేదరమెట్ల కొండలరావు, శేషగిరిరావు సుబ్బారావు, బోడపాటి హనుమంతరావు, పౌలు పరామర్శించారు.


మాట్లాడుతున్న తహశీల్దారు శ్రీచరణ్

పొగాకు సాగు చేయొద్దు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలో పొగాకు సాగు నిషేధించినట్లు తహశీల్దారు శ్రీచరణ్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2025-26లో పొగాకు సాగు చేయవద్దని, పొగాకు నర్సరీలు సాగు చేసేవారు కంపెనీ వాళ్ల మాటలు విని నర్సరీలు సాగు చేస్తే పెట్టుబడులు నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. తహశీల్దారు కార్యాలయంలో మండల టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. సమావేశంలో ఎడిఎ బి ఎర్రాయం మాట్లాడుతూ గతేడాది పొగాకు సాగు చేసిన రైతులు నష్టం చవిచూడాల్సి వచ్చిందని, ఆ సమయంలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేపట్టారని, ఇంకా రైతుల వద్ద పొగాకు నిల్వలు అధికంగా ఉన్న దృష్ట్యా ఈ ఏడాది పొగాకు సాగు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ, ఎస్ఐ నరసింహులు, ఎఎంసి వైస్ చైర్మన్ ధర్మవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర' కోసం చేతులు కలుపుదాం

ప్రజాశక్తి - రేపల్లె

ప్రతినెల 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్య వంతమైన సమాజం నిర్మిద్దామని ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు, తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని అంకమ్మ చెట్టు సెంటర్ నందు మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఆగష్టు నెల థీమ్ పరిశుభ్రతతో పాటు వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవటం అన్నారు. మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతతో స్వచ్ఛంగా తీర్చిదిద్దుకోవటానికి బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి నిల్వలు తొలగించి దోమల పెంపకం నివారించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు నిరంజన్ బాబు, ఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని ఉప్పుటూరులో స్వచ్ఛా ఆంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు త్రాగాలని, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, బహిరంగ మల విసర్జన మానేయాలని అన్నారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా పంచాయతీ చెత్త బండ్లకు అందించాలని అన్నారు.

యద్దనపూడి : స్థానిక పిహెచ్‌సి ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ స్వచ్ఛమైన వాతావరణం కావాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటలని అన్నారు. మండలంలోని యనమదల యుపి పాఠశాల హెచ్‌ఎం గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాల చుట్టు పెరిగిన గడ్డి



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి

పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ చంద్రశేఖర్, ఎంపిహెచ్ఇఒ వెంకటేశ్వరరెడ్డి, పార్మాసిస్ట్ చంద్రశేఖరరావు, అకిరా, ఆమని, ఉపాధ్యాయులు కోటి మస్తానరావు, పి శ్రీనివాసరావు, కె రాణి, పి లీలా రాణి, బి నాగరాజ కుమారి పాల్గొన్నారు.

అద్దంకి : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆగస్టు మాసంలో వర్షాకాల పరిశుభ్రత, వర్షాకాల సంబంధిత వ్యాధుల నివారణ వ్యూహాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం చెట్లు నాటారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సీ సెల్ ఉపాధ్యక్షులు మంద నాగేశ్వరరావు , ఎఎంసి కార్యదర్శి కె సూర్యప్రకాష్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరు : గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేయాలని డిఎల్‌డిఒ పి పద్మావతి సూచించారు. స్థానిక పంచాయతీలో అధికారులతో కలిసి స్వమిత్ర కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పరిశుభ్రత పాటించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో అవగాహన కల్పించి పారిశుద్యం పాటించాలని అన్నారు. కార్యక్రమంలో బి సుశీల, ఇంచార్జ్ ఎంపిడిఒ సిహెచ్ శేఖర్ బాబు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - చిన్నగంజాం

మండలంలోని ఎరువుల దుకాణాల్లో టాస్క్ ఫోర్స్ టీం తనిఖీలు శనివారం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్లో ప్రధానంగా సాగు చేసే వరి పంట మొదలవుతున్న దృష్ట్యా ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. యూరియా గురించి ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు జె ప్రభాకరరావు, ఎఒ కె భాస్కరరావు, ఎఎస్ఐ విజయ్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : స్థానిక ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. యూరియా, డిఎపి తదితర ఎరువుల కొరత ఏర్పడడంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎరువుల విక్రయ ధరల ధరల వివరాలు ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఫారెస్టు రేంజర్ షేక్ సైదులు, డిప్యూటీ తహశీల్దారు లక్ష్మీపార్వతి, ఎఒ ఎండి ఫారూఖ్


స్టాకు తెలుసుకుంటున్న తహశీల్దార ప్రభాకరరావు

పాల్గొన్నారు. ఎరువుల అమ్మకాల్లో కృత్రిమ కొరత సృష్టించిన, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

రేపల్లె : ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో త్రీ మెన్ కమిటీ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఒ మహేష్, ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులు కొనసాగించాలి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

గుంటూరు, తెనాలి నుండి రేపల్లెకు వెళ్లే రైలుబండ్లను ట్రాక్ మరమ్మత్తులు కారణంగా నిలిపివేసిన దృష్ట్యా రేపల్లె, తెనాలి ఆర్టీసీ డిపోల ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. రేపల్లె నుండి తెనాలి వరకు 4బస్సులు, తెనాలి నుండి రేపల్లెకు 4బస్సులు కేటాయించారు. వీటితో రైలు బండి లేని లోటును ప్రయాణికులకు తీర్చినట్లైంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టిన దృష్ట్యా బస్సుల వినియోగం, అవసరత ఉంది. ఈనెల 24 నుండి రైళ్ల రాకపోకలు కొనసాగించే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రస్తుతం తెనాలి, రేపల్లె డిపోల నుండి ఏర్పాటు చేసిన బస్సులు నిలిపివేయకుండా యధావిధిగా కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై తెనాలి ఆర్టీసీ డిపో మేనేజరు మాట్లాడుతూ రైలు బండి లేని కారణంగా వేరే ప్రాంతాల్లో తిరగాల్సిన బస్సులు రేపల్లె, తెనాలికి కేటాయించామని తెలిపారు. 24 నుండి రైళ్ల రాకపోకలు ఉన్న దృష్ట్యా 2బస్సులు నిలిపివేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుండి డిపోకు అదనంగా కొత్త బస్సులు వచ్చిన అనంతరం పునరుద్ధరిస్తామని తెలిపారు.


మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టిడిపి నాయకుడు నాగేంద్రరావు మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని భట్టిప్రోలు దళితవాడలో తెలుగుదేశం సీనియర్ కార్యకర్త నీల నాగేంద్రరావు (తోట రాముడు) తీవ్ర అనారోగ్యానికి గురై శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టిడిపి బిసి సెల్ అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు, వెల్లటూరు కెనాల్ డిసి అధ్యక్షులు యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, టిడిపి ఎస్సీ సెల్ కార్యదర్శి కనపర్తి సుందర్రావు, జంగం శంససన్, పోకూరు సురేంద్ర, ఇబ్రహీం బేక్ నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


విద్యార్థుల పుస్తకాలు పరిశీలిస్తున్న డైట్ కళాశాల అధికారి

హ్యాండ్‌బుక్ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మోడల్)ను డైట్ కళాశాల అధికారి రమేష్ బాబు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని తరగతులు పరిశీలించి విద్యార్థుల ప్రతిభాపాటవాలు ఎలా ఉన్నాయో అంచనా వేశారు. మధ్యాహ్నం భోజనాన్ని అక్కడే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పరీక్ష విధానం చాలా బాగుందని, ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. హెచ్‌ఎం సరోజిని, ఉపాధ్యాయులు పావులూరి శ్రీనివాసరావు, పద్మావతి మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

25న జాబ్ మేళా

ప్రజాశక్తి - చీరాల

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న స్థాఇనక వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా జరగనుంది. టెక్ మహీంద్రా, హిటాచి, వరుణ్ మోటర్స్ సహా పలు కంపెనీలు పాల్గొంటున్న మేళాలో 500కుపైగా ఉద్యోగాలు భర్తీ చేస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల నైపుణ్యం, అర్హతలను బట్టి రూ.10వేల నుండి రూ.20 వేల నెలవారీ వేతనం వస్తుందని అన్నారు. 18 నుండి 30 ఏళ్ల వయస్సు కలిగి ఎస్ఎస్‌సి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులు https://naipunyam.ap.gov.in లో నమోదు చేసుకోవాలి. వివరాలకు 99888 53335, 79814 43777 నంబర్లలో సంప్రదించవచ్చని అన్నారు.

పొగాకు రైతుల్లో ఆందోళన

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా జరుగుతున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు వ్యవహారం రైతులను ఇబ్బందుల పాల్జేస్తోంది. కొనుగోలు కేంద్రాలు అయితే తెరిచారు గానీ రైతులు తెచ్చిన పొగాకు బేళ్ళను పలు కారణాలు చూయించి తిప్పిపంపుతున్న కారణంగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు పంట చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అధికారులు తుంగలో తొక్కుతున్నారు. రైతులు తెచ్చిన పొగాకు నాణ్యతగా లేదంటూ పొగాకు బేళ్ళను వెనక్కు పంపడం చేస్తున్నారు. ఈ వ్యవహారం అంతా ప్రైవేట్ వ్యాపారులకు లాభం చేకూరేలా ఉంటోంది. దీంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. పొగాకు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకునే చర్యలు చేపట్టాలి. కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులకు చెందిన పొగాకు కొనుగోలుకు ప్రాధాన్యతనివ్వాలి.



ఇప్పటి వరకు కొన్న పొగాకుకు సంబంధించి రైతులకు నగదు చెల్లింపులు నేటికీ జరగలేదు. పొగాకు కొన్న వెంటనే చెల్లింపులు చేస్తామని చెప్పారు గానీ నగదు చెల్లింపులు లేవు. రైతులు ఖరీఫ్ సేద్యం చేసేందుకు తక్షణమే నగదు విడుదల చేసి రైతులను ఆదుకోవాల్సి ఉంది.

జిల్లావ్యాప్తంగా 3,829 మంది అనర్హులుగా ఉన్నవారు దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నారంటూ వారందరికి అధికారులు నోటీసులు ఇవ్వడం కలకలం రేపింది. గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల సదరమ్ సర్టిఫికెట్లలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ దివ్యాంగుల పింఛన్లను రీ వెరిఫికేషన్ జరిపారు. ఈ విచారణలో 3,829 మంది అనర్హులుగా ఉన్నట్లు తేల్చారు. అయితే తాము దివ్యాంగులు అయిప్పటికి తమ పింఛన్లను వెరిఫికేషన్ పేరుతో ఆపివేయడం జరిగిందని, వాటిని మళ్ళీ పరిశీలించి వెంటనే పునరుద్ధరించాలని పలువురు దివ్యాంగులు జిల్లా కేంద్రంలోనూ పలు మండల కేంద్రాల్లో అధికారులను కలసి విన్నవించుకున్నారు. కొత్తగా జరిపిన వెరిఫికేషన్‌లో తమను సక్రమంగా పరిక్షించలేదని తమ వైకల్య శాతాన్ని 40గా పేర్కొనడంతో పింఛన్లు కోల్పోతున్నామని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని మండల కేంద్రాల్లో వెరిఫికేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి అర్హులైన దివ్యాంగులను గుర్తించి న్యాయం జరిగే చర్యలు చేపట్టాల్సి ఉంది.

జిల్లాలో ఇప్పటి వరకు 1లక్ష 90 వేల ఎకరాల్లో పంటల సాగు జరిగింది. ఈ సీజన్‌లో రైతుల అవసరాల కోసం 21,600 మెట్రిక్ టన్నులు యూరియా, డిఎపి 11,300 మెట్రిక్ టన్నులు, పోటాష్ 788,కాంప్లెక్స్ ఎరువులు 17 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉంది. రైతులు అత్యధికంగా యూరియాను అడుగుతున్న క్రమంలో సరఫరాలో జరుగుతున్న జాప్యం కారణంగా కృత్రిమ కొరత ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు యూరియాను వ్యవసాయేతర పనుల కోసం వినియోగిస్తున్న నేపథ్యంలో మార్కెట్‌లో యూరియా లభ్యత తక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. యూరియా కొరత ఏర్పడుతుందనే ఉద్దేశ్యంతో రైతులు ముందుగానే అధిక మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఖరీఫ్‌లో పంటల సాగుకు కావలసిన ఎరువుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విజ్ఞానదాయకం.. పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పుస్తకాల అధ్యయనం విజ్ఞాన దాయకమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఒంగోలులో జరుగుతున్న మూడవ పుస్తక మహెూత్సవం తొమ్మిదవ రోజు శనివారం పాఠకులు,విద్యార్థుల సందడితో ఉత్సాహం నింపింది. ఆదివారం నాడు మహెూత్సవం చివరి రోజు కావడంతో స్టాల్స్ వద్ద పుస్తక కొనుగోలుకు వచ్చిన పాఠకులు ఉత్సాహం చూపారు. పాఠకుల కోరిక మేరకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

- సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ రెండు ప్రముఖ పుస్తకాలను ఆవిష్కరించింది. సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ మన చరిత్ర పుస్తకాన్ని, రాష్ట్ర సిపిఐ నాయకులు హరినాథరెడ్డి భారత దర్శనం పుస్తకాన్ని విడుదల చేశారు.

తరువాత జరిగిన ప్రకాశం జిల్లా సంస్కృతి - సాహిత్యం - కళారంగం"అంశంపై చర్చా సభకు సినీ నటుడు, నిర్మాత మాదాల రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, హరినాథరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నేతలు ఎ.వి. పుల్లారావు, చంద్ర నాయక్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

జానపద గీతంతో ఉత్తేజం

చంద్ర నాయక్ జానపద గీతం వందనం.. వందనం.. ఆలపించి సభలో ఉత్సాహం నింపగా, మాదాల రవి ప్రసంగిస్తూ ప్రకాశం జిల్లా నుంచి సినీ రంగానికి మాదాల రంగారావు, జానీ లీవర్, కొరియోగ్రాఫర్లు, ఫైట్ మాస్టర్లు వంటి పలువురు అందించిన సేవలను ప్రస్తావించారు.

ఆదివారం చివరి రోజు కావడంతో పాఠకులు, ప్రజలు తప్పక సందర్శించి విజ్ఞానాన్ని ఆర్జించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

బర్లీ పొగాకు సాగు తాత్కాలిక నిషేధం

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు పంట సాగును తాత్కాలికంగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఆ మేరకు జిఓ ఆర్ టి నెంబర్ 740 ఉత్తర్వులను ప్రభుత్వం అధికారికంగా జారీ చేసిందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఏడాది పాటు పొగాకు సాగు నిషేధించినట్లు కలెక్టర్ ప్రకటించారు. రైతులంతా ప్రత్యామ్నాయ పంటలవైపు దష్టి సారించాలన్నారు. ప్రస్తుతం బ్లాక్ బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధాజ్ఞలు విధించిందన్నారు. ఈ విషయాలపై అన్ని గ్రామాలలో టామ్ టామ్ వేయించాలన్నారు. పొగాకు పంట వేయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఎన్ఫోర్స్మెంట్ టీములను నియమించామన్నారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంయుక్త కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, లా అధికారి పనిచేస్తారన్నారు. నియమించిన బందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఒక్క ఎకరా పొగాకు పంట వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులపై ఉందన్నారు. ఎక్కడైనా రహస్యంగా వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు పంటలు వేస్తే వెంటనే పెరికి వేయాలన్నారు. నర్సరీలలో పొగనారు వేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఏడాది పాటు పొగాకు పంట వేయరాదని సూచించారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను 1,500 టన్నులు మార్క్ ఫెడ్ ద్వారా కనుగోలు చేశామన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఏడి అన్నపూర్ణ, ఆర్డీవోలు, తహసిల్దార్లు, పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయాల వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

కేజీబీవీల్లో కార్యదర్శి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు, పొదిలి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో శనివారం కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పర్యటన సాయంత్రం 4 గంటల వరకు కొనసాగి విద్యా, వసతి, పరిపాలన రంగాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. కురిచేడు విద్యార్థినులతో అల్పాహారం, ముండ్లమూరులో మధ్యాహ్న భోజనం చేస్తూ ఆహారం నాణ్యత, పరిమాణం స్వయంగా పరిశీలించారు. పిల్లలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. తరగతి గదుల్లోనే డిక్టేషన్ పరీక్ష నిర్వహించి విద్యార్థుల భాషా నైపుణ్యాన్ని అంచనా వేశారు. అనంతరం ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశమై విద్యా ప్రమాణాల పెంపుపై దిశానిర్దేశం చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్యదర్శి దేవానందరెడ్డి

స్వామిత్వ సర్వే పనులు వేగవంతం

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్వామిత్వ సర్వే పనులను అధికారులు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. స్వామిత్వ సర్వే, పి 4 అమలు, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం వంటి అంశాలపై డివిజన్ మండల స్థాయి అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. స్వామిత్వ సర్వేలో డ్రోన్ చిత్రాలను పిపిఎం ఆధారంగా కొలతలు సరి చూడాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. స్వామిత్వ సర్వేలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను క్యూజిఐఎ సాఫ్ట్‌వేర్ అనుసంధానంతో పరిష్కరించాలన్నారు. డ్రోన్ సర్వే, సర్వేర్లతో చేపట్టే ఫిజికల్ సర్వేలో తారతమ్యాలు లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కార మార్గం చూపాలన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, చిన్నగంజాం, రేపల్లె, కర్లపాలెం, పి.వి పాలెం, పర్చూరు, మార్టూరు, చెరుకుపల్లి, రేపల్లె, నగరం, చుండూరు మండలాల్లో స్వామిత్వ సర్వే ఆశించిన స్థాయిలో జరగడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాలలో సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే పురోగతికి డి ఎల్ డి ఓలు బాధ్యులని స్పష్టం చేశారు. స్వామిత్వ సర్వేపై ప్రతిరోజు మండల స్థాయిలో సమీక్షలు జరగాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడి కనక ప్రసాద్, ఆర్డీవోలు పాల్గొన్నారు.